మిర్చి రైతుకు వాన గుబులు

- వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆందోళన
- ఇప్పుడు వర్షాలు పడితే కోలుకోలేమంటూ ఆవేదన

కుక్కునూరు: గిట్టుబాట ధర లేక కొట్టుమిట్టాడతున్న మిర్చి రైతుల గుండెల్లో వాన గండం గుబులు రేపుతుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు మిర్చి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ ఏడాది మిర్చికి సరైన ధర లేక పెట్టిన పెట్టుబడి రావడం కూడా కష్టంగా తయారైన పరిస్థితుల్లో వాతావరణ ప్రతికూల పరిస్థితులతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. గత రెండు, మూడు రోజుల వరకు మిర్చి ధర క్వింటాకు రూ.14 వేలు ఉండగా ప్రస్తుతం అది రూ.11 వేలకు పడిపోయింది. మిరప కోతలకు కూలీల ఖర్చులే క్వింటాల్‌కు రూ.7 వేల వరకు అవతుండగా రూ.11 వేలు ధరతో ఏం చేయాలో పాలుపోక దిగాలు చెందుతున్న రైతన్నలకు ప్రస్తుత ద్రోణి మూలిగే నక్కపై తాటికాయ సామేత మాదిరి తయారైందని పలువురు వాఖ్యానిస్తున్నారు.


కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంట

ముమ్మరంగా మిర్చి కోతలు

ఇప్పటికే మండల వ్యాప్తంగా మిరప కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోసిన పంటను రైతులు కల్లాల్లో ఆరబెట్టుకుంటున్నారు. కొంతమంది రైతులు కూలీల కొరతతో ఇప్పటికీ ఇంకా మొదటి కోత కూడా పూర్తి చేయలేదు. ఇప్పుడు అకాల వర్షాలు కురిస్తే చేతికందిన పంట వర్షార్పణం అవ్వడంతో పాటు చేలో కాయలు తడిచి తాలు కాయలు పెరుగుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో పలు ప్రాంతాల్లో ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇక్కడి రైతులు ముందస్తు చర్యలు చేపట్టారు. వర్షం పడితే పంట తడవకుండా ఉండేందుకు పాలిథిన్ కవర్లను సిద్ధం చేసుకుంటున్నారు. ఎండిన కాయలను అమ్మేస్తున్నారు. ఏది ఏమైనప్పటికి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వర్షం కురిస్తే మాత్రం మిర్చి రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలినట్టేనని రైతులు వాఖ్యానిస్తున్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకుంటే తప్ప అప్పుల ఊబిలో నుంచి బయట పడే అవకాశం లేదని ప్రభుత్వం తమని ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వర్షం పడితే కోలుకోలేని దెబ్బ



నేను కుక్కునూరులో ఏడెకరాల పంటను సాగుచేస్తున్నా. ఈ సారి దిగుబడి మంచిగా ఉన్నా గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నాం. కల్లాల్లో పంటను ఆరబెట్టిన నేపథ్యంలో ఇప్పుడు వర్షం పడితే కనక రైతులకు కోలుకోలేని దెబ్బతగిలినట్టే.

– దడిదాకుల వెంకన్న, మిర్చి రైతు, కుక్కునూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



మిర్చి పంటకు సరైన గిట్టుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడే వచ్చే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో వర్షం పడితే మిర్చి రైతులు అప్పుల ఊబిలో చిక్కుకున్నట్టే. ప్రభుత్వమే మా మిర్చి రైతులను ఆదుకోవాలి.

– కట్టెబోయిన రాంబాబు, మిర్చి రైతు, కుక్కునూరు

గిట్టుబాటు ధర లేదు



నేను ఈ ఏడాది మిర్చి పంటను 15 ఎకరాల్లో సాగుచేశా. ఇప్పటికే గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నాం, ఇప్పుడు వర్షం పడితే మిర్చి రైతులు అందరూ నిండా మునిగినట్టే. మాకు ఆ దేవుడే దిక్కు.

– డి.రామయ్య, మిర్చి రైతు, కుక్కునూరు

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం


ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారి అభిషేక మహోత్సవాన్ని వీక్షించి తరించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పారిజాతగిరిలో పూజలు


శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, విద్యార్థులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు దాతలు డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ నాగమణి, డాక్టర్ హరీష్, విష్ణునందన్ కుటుంబసభ్యులు అన్న ప్రసాద వితరణ చేసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. దాతలను ఆలయ అర్చకులు వేదాశీర్వాదంతో సత్కరించారు.

స్వర్ణమయ పథకానికి రూ.1.51 లక్షల విరాళం


దాత శ్రీనుకి విరాళం బాండ్ పత్రం అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి విమానగోపుర స్వర్ణమయ పథకానికి ఒక భక్తుడు శనివారం రూ.1,51,116 విరాళంగా అందజేశారు. ద్వారకాతిరుమలకు చెందిన ఇడుముడి శ్రీను ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఎస్సై చెన్నారావుకు ప్రతిభ పురస్కారం


ఎస్సై చెన్నారావుకు ప్రతిభ పురస్కార పత్రం అందజేస్తున్న ఎస్పీ

కామవరపుకోట: కామవరపుకోట ఎస్సై పి.చెన్నారావు, కానిస్టేబుల్ కేపీడీవీఎన్ కొండలరావు ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. వీరికి శనివారం ఎస్పీ కేపీఎస్ కిషోర్ వీరికి ప్రతిభా పురస్కారాన్ని అందించారు. 2019లో తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో జీలకర్రగూడెం గ్రామం గుంటుపల్లి గుహల దగ్గర మైనర్ బాలికపై లైంగిక దాడి, హత్య జరిగిన ఘటన చోటు చేసుకుంది. ఈ కేసులో ముద్దాయిలు నలుగురికి ఏలూరు పోక్సో యాక్ట్ స్పెషల్ కోర్టు గౌరవ న్యాయమూర్తి జీవితకాల శిక్షను విధించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారుల్లో తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు, కోర్ట్ కానిస్టేబుల్ కేపీడీవీఎన్ కొండలరావు ఉన్నారు. వీరికి ఎస్పీ కేపీఎస్ కిషోర్ శనివారం ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

రైతులకు తేనె పెట్టెలు, పరికరాల పంపిణీ


గిరిజన రైతులకు తేనె పెట్టెలు, పరికరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: రెడ్డికుంకాల గ్రామంలో శనివారం గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ (జీవీఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో తేనె పెట్టెలు, పరికరాలు 31 మంది గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, సంస్థ డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా గిరిజనులకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఐటీడీఏ హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏపీ ఎస్టీ సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, పోలవరం జెడ్పీటీసీ హేమకుమారి, కుర్సం దుర్గారావు, సర్పంచ్ గంగాదేవి, కోటం లక్ష్మణరావు, కె.పోతురాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చండీహోమం


విజయదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న చండీహోమం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో శనివారం చండీహోమం నిర్వహించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని ఆలయ శాశ్వత కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహన్‌రావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు, వేద పండితులు సత్యకిరణ్ చండీహోమం నిర్వహించారు. కనిగొల్ల సుబ్బారావు, అన్నపూర్ణ దంపతులు, చిట్లూరి సుహాసిని దంపతులు ఉభయదారులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈమని శశికుమార్, కేఎల్ఎన్ ధనకుమార్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

సేంద్రియ సాగు చేస్తున్న రైతులకు సత్కారం


సేంద్రియ వ్యవసాయ రైతులను సత్కరిస్తున్న ఏడీఏ బుజ్జిబాబు

కొయ్యలగూడెం: ప్రకృతి వ్యవసాయ శాఖ, మండల సమైక్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఏడీఏ పీజీ బుజ్జిబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులు లేకుండా సేంద్రియ వ్యవసాయం ద్వారా పంటలు పండించాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. ఈ సందర్భంగా మండలంలో వర్మి కంపోస్టు ద్వారా పంటలు పండిస్తున్న రైతులను, వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్న రైతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు

పోలవరం రూరల్: క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ హెచ్చరించారు. ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైన నేపథ్యంలో ఎక్కడైనా బెట్టింగ్‌లు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకుని భావితరాలకు నీటి వనరులను అందించేలా బాధ్యత తీసుకోవాలని స్పార్క్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎస్.త్రినాథ్ అన్నారు. స్థానిక శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో కళాశాల చైర్మన్ బీవీ కృష్ణారావు అధ్యక్షతన ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం పర్యవేక్షణలో స్పార్క్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో త్రినాథ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నీటి వనరులు, లభ్యత, వినియోగం, సంరక్షణ ఆవశ్యకతను తెలియజేయాలన్నారు.

రసాభాసగా మండల పరిషత్ సమావేశం

- అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఫిర్యాదు
- నేలపై బైఠాయించి ఎంపీటీసీల నిరసన

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండల పరిషత్ సమావేశం రసాభాసగా మారింది. తమకు ఎటువంటి సమాచారం అందించడం లేదంటూ ఎంపీటీసీలు సమావేశంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఎంపీపీ కొదమజ్యోతి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషిచేయాలని కోరారు. పలు అభివృద్ధి అంశాలపై శాఖల వారీగా సమీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో నిమ్మలగూడెం ఎంపీటీసీ తానిగడప నిర్మలాకుమారి గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు చేయడం లేదని, నిర్వహించే కార్యక్రమాలపై ఎటువంటి సమాచారం ఉండటం లేదన్నారు. అలాగే వేగవరం ఎంపీటీసీలు కుక్కల సత్యనారాయణ, పోతన శ్రీనివాసరావు బీసీ కార్పొరేషన్ రుణాలతో పాటు, పంచాయతీలో నిర్వహించే కార్యక్రమాలపై సరైన సమాచారం ఉండటం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీలు సమావేశ మందిరంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి స్పందిస్తూ గ్రామ సర్పంచ్ తీర్మానాలు చేయకపోతే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. అలాగే ఆయా గ్రామ పంచాయతీల్లో జరిగే కార్యక్రమాలు, ఇతర అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో, ప్రొటోకాల్ ప్రకారం వ్యవహరించాలని బాబ్జి సూచించారు. ఎంపీటీసీలను సముదాయించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని బాబ్జి తెలపడంతో ఎంపీటీసీలు నిరసన విరమించారు. కాగా, శనివారం జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌చే నూతన బస్సు సర్వీసు ప్రారంభం కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీలకు ప్రొటోకాల్ ప్రకారం పిలుపులేదని ఆర్టీసీ అధికారులపై బాబ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం మండల పరిషత్ సమావేశంలో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

వాటర్ ట్యాంకర్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం: దాతల సహకారం ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని చేసేందుకు వీలుంటుందని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద టెక్సమో వారు నూతనంగా మున్సిపాలిటీకి బహూకరించిన వాటర్ ట్యాంకులను శనివారం చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో జంగారెడ్డిగూడెం ప్రజలకు ఎటువంటి తాగునీటి కొరత లేకుండా చూసుకుంటామని, ఎక్కడైనా సమస్యలు ఉంటే స్థానిక సచివాలయంకి వెళ్లి సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. కౌన్సిలర్లు ఉగ్గం దుర్గాప్రసాద్, నంబూరు రామచంద్రరాజు, బత్తిన చిన్న, టెక్సమో శ్రీరాములు, మురళీ, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, దాకారపు కృష్ణ, ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

చట్టాలపై అవగాహన అవసరం

చింతలపూడి: చింతలపూడి సబ్ జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు శనివారం సందర్శించారు. సబ్ జైల్‌లో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాలను గురించి జైలు అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలపై అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. ఆర్థిక స్తోమత లేక న్యాయవాదిని పెట్టుకోలేని వారి కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతకు ముందు వంటశాలను స్టోర్ రూంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్ కే అప్పయ్య, పీఎల్‌వీపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టం గురించి తెలుసుకోండి

నేటి సమాజంలో విద్యార్థి దశ నుంచే లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్ మధుబాబు అన్నారు. బాలికల వసతి గృహాన్ని శనివారం సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులు అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు తీసుకోవడంతో కొందరు వారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. చిన్నారుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే వెంటనే తల్లికి గాని దగ్గర్లో పోలీస్ స్టేషన్ వద్ద గాని ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పానల్ లాయర్ పీఎల్‌వీ, పోలీస్, హాస్టల్ వార్డెన్ సిబ్బంది పాల్గొన్నారు.


చింతలపూడి సబ్‌జైల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

విజయవాడకు బస్సు సర్వీస్ ప్రారంభం


ఆర్టీసీ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శనివారం ప్రారంభించారు. నూతన సర్వీసు జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, విసన్నపేట మీదుగా విజయవాడ చేరుకుంటుందని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. ఆర్టీసీ పురోగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులతోపాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సింహాద్రి వెంకటేశ్వరరావు (దాసు) కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతలు శనివారం నిత్యావసర సరుకులను అందజేశారు. ముందుగా దాసు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ బిరుదుగడ్డ బజారియ్య, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఏసురత్నం తదితరులు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రూ. 1,000 నగదు, 50 కేజీల బియ్యం, 15 కేజీల మంచినూనె, 25 కేజీల ఉల్లిపాయలను దాసు కుమారుడు సుమంత్, సోదరుడు శ్రీనులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పున్నపు కృష్ణ, రాచగర్ల రామకృష్ణ, కస్సే గంగరాజు, అందుగుల రమేష్, పాంగులేటి సంతోష్, గంజి నాగార్జున, రెడ్డి చిన్ని, బోడ అశోక్, కేశవ, ఊట్ల పండు, భూపతి కన్న, నవీన్, సుబ్బు, దంపెల్లి రమేష్, ఈల్ అఖిల్, బోడ రవి, లక్కాబత్తుల వినోద్, కట్టూరి మంగరాజు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

బుట్టాయగూడెం: నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తమ వంతుగా సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనుబాబు కోరారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి, పి. అంకంపాలెం గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ దాడులు

చింతలపూడి: ఏలూరు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆవులయ్య ఆధ్వర్యంలో నాగిరెడ్డిగూడెంలో శనివారం నాటు సారా స్థావరాలపై విస్తృతంగా దాడులు జరిపారు. దాడుల్లో భూక్యా నాగరాజు, వడిత్య బాలమ్మ, బాణావతు జ్యోతి, వడిత్య రామదాసు, వడిత్య బాలరాజులను అరెస్ట్ చేసి వారి నుంచి 95 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని 2,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ పి అశోక్ తెలిపారు. దాడుల్లో ఏఈఎస్ పాండురంగారావు, అజయ్‌కుమార్ సింగ్, సీఐలు ధనరాజ్, సత్యవతి, ఎస్సైలు నరసింహారావు, అబ్దుల్ కలీల్, జగ్గారావు పాల్గొన్నారు. అనంతరం నాటు సారా వల్ల కలిగే అనర్థాలపై నాగిరెడ్డిగూడెం గ్రామస్తులకు అవగాహన కలిగించారు.


బుట్టాయగూడెం: అంకంపాలెంలో అవగాహన కలిగిస్తున్న ఎక్సైజ్ అధికారులు


చింతలపూడి: నాటుసారా స్థావరాలపై కూంబింగ్ నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మత్స్యకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంలో శ్రీ సీతారామాంజనేయ ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు బంటుమిల్లి బాలకృష్ణ ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులకు శనివారం డిజిటల్ ఫొటో గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సయ్య చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మత్స్యకార సొసైటీ సభ్యులకు వివిధ రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు, వలలు, సబ్సిడీపై చేప పిల్లలు, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను ఈ గుర్తింపు కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. మత్సకార సభ్యులు ఐక్యతతో కృషి చేసి మత్స్యసంపదను పెంపొందించాలని కోరారు. అనంతరం మత్స్యశాఖ అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు మల్లిబోయిన వెంకటేశ్వరరావు, భీమడోలు మత్స్య అభివృద్ధి అధికారి ఎస్ లీలాదుర్గాదేవి, గ్రామ మత్స్య సహాయకుడు రాంబాబు, ఫిషర్‌మెన్ సొసైటీ ఉపాధ్యక్షుడు మల్లిబోయిన వెంకటేశ్వరరావు, సెక్రటరీ మాండ్రు వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.


ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులకు డిజిటల్ గుర్తింపు కార్డులను అందజేస్తున్న దృశ్యం

పంట గుంటలతో భూగర్భ జలాలు మెరుగు

లింగపాలెం: పంట గుంటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ధర్మాజీగూడెంలో పంట గుంటలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షపు నీరు వృథా కాకుండా పంట గుంటలు తవ్వాలని, దీంతో భూగర్భ జలాలు మెరుగుపడతాయని, తద్వారా భవిష్యత్ తరాలకు నీరు పుష్కలంగా అందించవచ్చునని అన్నారు. చింతలపూడి మండలం ఇంటిగ్రేటెడ్ ఫార్మర్ క్లస్టర్‌గా ఎంపికై నట్టు ఎమ్మెల్యే రోషన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏన్‌ఆర్‌ఈజీయస్ ఏపీడీ శ్రీదేవి, లింగపాలెం ఎంపీడీవో శ్రీవాణి, జి.చలపతిరావు, నాగ బుద్ధ వరప్రసాద్, మోరంపూడి ప్రసాద్, నిమ్మగడ్డ సుధాకర్, కుర్రా సుబ్బారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: ప్రగడపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా ఫారంపాండ్ పనులు ప్రారంభించారు. నీటిని నిల్వ చేసుకునేందుకు గుంటలను తవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఈ పనులను ప్రారంభించారు. ఫారంపాండ్‌లు తవ్వడం వల్ల భూగర్భజలాలు పెరిగి నీరు సమృద్ధిగా లభ్యమయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధరరావు, సర్పంచ్ కలుం బాపిరాజు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు దోహదం

కొయ్యలగూడెం: భూగర్భ జలాల పరిరక్షణకు ఫారం పాండ్ ఎంతగానో దోహదపడుతుందని సన్న, చిన్న కారు రైతులకు ఈ పథకం ప్రయోజనకరం అని ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బయ్యనగూడెంలో ఫారంపాండ్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన పూజలు చేశారు. అదేవిధంగా కొయ్యలగూడెంలో ఫారంపాండ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అతి తక్కువ ఖర్చుతో ఫారంపాండ్‌ను నిర్మిస్తున్నట్లు ఏపీవో నాగేశ్వరరావు తెలిపారు. 8 పంచాయతీల్లో ఫారం పాండ్ నిర్మాణాలకు ప్రజాప్రతినిధులు ప్రారంభ పూజలు నిర్వహించారు.


పోలవరం: ప్రగడపల్లిలో ఫారం పాండ్ పనులను ప్రారంభించిన ఎంపీపీ వెంకటరెడ్డి


కొయ్యలగూడెం: ఫారం పాండ్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

వైఎస్సార్ కాలనీకి సురక్షిత నీరు అందించాలి

చింతలపూడి: స్థానిక వైఎస్సార్ కాలనీ నిర్మించి 18 ఏళ్లు గడుస్తున్న కాలనీలో సమస్యలు పరిష్కరించకపోవడం శోచనీయమని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ సూర్యకుమార్ వాపోయారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, సురక్షితమైన తాగునీరు అందించాలని కోరుతూ శనివారం నగర పంచాయతీ కమిషనర్ పావనికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కాలనీవాసులు ఎంతో కాలం నుంచి మంచినీటి కోసం పోరాటం చేస్తున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాలనీలో రహదారులు, పక్కా డ్రెయిన్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కన్వీనర్ పి పాండురంగారావు, రామిశెట్టి సత్యనారాయణ, మహిళా సంఘం నాయకులు ఎం వరలక్ష్మీ దేవి, కె అనురాధ, ఆర్ ధర్మారావు పాల్గొన్నారు.


నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు